వుంచుతూ అడిగాడు.''

''ఇంకా పెట్టలేదు. చంటి అంటాం మేమంతా'' మధుసూదన్ చెప్పాడు.

డాక్టర్ ఆ పేరే వ్రాసుకున్నాడు. పాప పొట్ట నొక్కి చూశాడు. నాలుక తెరవమన్నాడు. కళ్ళు పరీక్షిస్తూ డాక్టర్ అనుమానంగా ఆగిపోయాడు.

''పాపకు జాండిస్ అని అనుమానంగా వుంది. బ్లెడ్ టెస్ట్... యూరిన్ టెస్ట్ చెయ్యాలి. తెల్ల కామెర్లు కావడాన మీరు గమనించలేకపోయారు. అయినా ఆకలి మందగించినప్పుడే నా దగ్గరకు రావలసింది'' డాక్టర్‌గారి మాటలు వింటున్న ఉమకు తల తిరిగిపోయింది.

''జాండిస్... కామెర్లు... ఆమె గుండె కొట్టుకొంటోంది. వెంటనే రామరాజుగారి మనవరాలు కళ్ళ ముందు మెదిలి వణికిపోయిందామె మనసు.

మధుసూదన్ పాపను బయటకు తీసుకువెళ్ళి యూరిన్ తెచ్చి ఇచ్చాడు. నర్సు పాప చేతిమీద పిన్ గుచ్చి రక్తం తీసుకుంది. చంటి కెవ్వుమంటుంటే ఉమ హృదయం విలవిల్లాడింది.

''సాయంత్రం... ఏ విషయం చెబుతాను'' అన్నాడు డాక్టర్.

''మాది ప్రక్క పల్లె డాక్టరుగారూ ఇప్పుడు వెళ్లి మళ్ళీ రావాలంటే చాలా కష్టం. ఓ గంట బయట కూర్చుంటాం. మీ రిపోర్టు ఇవ్వలేరా?'' అడిగాడు మధుసూదన్.

డాక్టర్ ఒక్క క్షణం ఆలోచించాడు. ''ఆల్‌రైట్... వరండాలో కూర్చోండి'' ఆయన లేచి పక్క రూమ్‌లోకి వెళ్ళాడు.

''ఏమన్నారే డాక్టర్?'' కన్సల్టింగ్ రూమ్ నుంచి బయటకు వస్తున్న కోడల్ని ఆదుర్దాగా అడిగింది ఇంద్రావతి.

''దిష్టి తగిలిందన్నారు. ప్రిస్క్రిప్షన్ కూడా రాశారు. ఓ పీశెడు మిరపకాయలు... పాపు కిలో ఉప్పు.''

ఉమ మాటలకు అంత బాధలోనూ ఫక్కున నవ్వొచ్చింది మధుసూదన్‌కి .

ఇంద్రావతి అయోమయంగా చూసింది ఇద్దరి వైపు.

''అవున్లెండి నా బిడ్డకు బాగోలేకపోతే మీకు నవ్వొస్తోంది'' ఉమ చంటితల్లి మధుసూదన్‌కి కూడా కూతురన్న విషయం మరచిపోయిందా క్షణం.

''ఆమె కళ్ళలో కన్నీరు చివ్వున ఊరింది. చంటి పాపను గట్టిగా హృదయానికి హత్తుకుంది.''

''ఒక్కరూ చెప్పరేమ్రా?'' ఇంద్రావతి ఆరాటంగా చూసింది.

''పాపకు కామెర్లంటున్నారమ్మా'' మధుసూదన్ బాధగా తల విదిల్చాడు.

''అయ్యో... నిజమేనటే?'' ఇంద్రావతి చంటిని చేతుల్లోకి లాక్కుంది.

''నిజమే'' నీరసంగా ఉంది ఉమ స్వరం.

ఇంద్రావతి కాసేపు ఏదో ఆలోచనలో మునిగిపోయి చటుక్కున తలెత్తి మధు వంక చూస్తూ అంది. ''అబ్బాయ్ మధూ కామెర్లకి ఈ ఇంగ్లీషు మందులవీ వాడకూడదురా. దీనికి వేరే వైద్యముంది. ఫసరుపోసి, దండ వేయించాలి. మన ఊళ్ళో రాంబాయమ్మ కామెర్లకి మందిస్తుందే.''

ఉమకు అరికాలి మంట నెత్తికెక్కింది ఇంద్రావతిని చూస్తుంటే. ''అత్తయ్యా అసలు మీ వల్లనే పాపకు జబ్బొచ్చింది. దానికి ఆకలి తగ్గిన మొదట్లోనే డాక్టర్‌కు చూపించి ఉంటే ఇంతవరకూ రాకపోను. దిష్టి తగిలిందంటూ వాదస్తంగా మాట్లాడి అనవసరంగా కాలయాపన చెయ్యడంతో దాని వ్యాధి ముదిరిపోయింది. పైగా ఇప్పుడేమో మందులు వాడనివ్వకుండా దండలూ, హారాలు అంటూ మొదలుపెట్టారు. రాంబాయమ్మలూ, సీతబాయమ్మలూ ఏం చేయగలరు? మీరు అట్టే మాట్లాడకుండా మెదలక కూర్చోండి. మా పాట్లేవే మేం పడతాం'' ఉమ వళ్లు మరచిపోయింది.

''చిన్నా, పెద్దా లేకుండా ఏమిటీ దూకుడు?'' ఇంద్రావతి అహం దెబ్బతిన్నది.

''మీరనడం లేదూ... ఊళ్ళోవాళ్ళందరినీ ఎంత మాటంటే అంత మాట. అసలు నన్నడిగితే ఆ నాంచారు ఉసురు తగిలే మన కొంపకు, అస్తమానం ఆవిడను ఆడిపోసుకోబట్టే ఇలా అయింది.''

ఇంద్రావతి ముఖం మలినమయింది. ఇద్దరి వాదనలూ వినలేకపోతున్నాడు మధుసూదన్.

''ఇది ఇల్లు కాదు... హాస్పిటల్ గుర్తుందా ఇద్దరిలో ఒక్కరికయినా?'' కోపంగా అన్నాడు.

ఉమ మౌనంగా తల దించుకుంది. గంట ఓ యుగంలా గడిచింది. డాక్టర్ రమ్మన్నాడు.

''పాపకు ఖచ్చితంగా జాండిసే. ఏమంతగా ముదర లేదు. సరియైన సమయానికి వచ్చారు'' డాక్టర్ ప్రిస్క్రిప్షన్ వ్రాస్తూ అన్నాడు.

ఉమ గుండెలు తేలికపడ్డాయి.

''చూడండి... ఈ మందులన్నీ శ్రద్ధగా వాడండి పాపను రెండు రోజుల కొకసారి నాకు చూపిస్తుండండి.''

''అలాగే డాక్టర్'' మధుసూదన్ తలాడించాడు. అతనికిప్పుడు మనసు కుదుటపడింది.

డాక్టర్‌గారి దగ్గర నుంచి బయలుదేరి బజార్లోకి వెళ్ళి మందులు కొనుక్కుని ఇంటికి వెళ్ళిపోయారు. దార్లో ఇంద్రావతి ఏం మాట్లాడలేదు. ఆమె ముఖం చిన్నబోయి వుంది. ఉమ అత్తగారి వాలకం గ్రహించలేకపోలేదు. ప్చ్... పాపం ఏదో పెద్దది. తనేమైనా అతిగా మాట్లాడిందేమో! మౌనంగా నిట్టూర్చింది.

మళ్ళీ అంతలోనే నాంచారు ముఖం గుర్తొచ్చి, అత్తగారి మీద జాలి ఎగిరిపోయింది. నాంచారు స్వతహాగా చాలా కలివిడి మనిషి. అందర్నీ నోరార పలకరిస్తుంది. అలాంటి మనిషిని పట్టుకుని ఎంతో అసహ్యంగా మాట్లాడుతుంది అత్తయ్య.

ఆలోచనల్లోనే ఇల్లొచ్చేసింది. చంటితల్లి బుజం మీద నిదురపోయింది. మెల్లగా పాపను ఊయల్లో పడుకోబెట్టింది ఉమ. ఇంద్రావతి అలసటగా మంచంమీదే

కాలమ్ దాటని కథ

పసి మనసు

ఆరేళ్ళ నానీ ఈ మధ్యే స్కూల్‌లో చేరాడు. రోజూ స్కూలుకు వెళ్ళి వస్తూ ఉంటాడు. రోజూ నడిచే వెళ్తాడు, ప్రక్క వీధిలోనే స్కూలుండటం వలన.

ఆ రోజు మామూలుగానే స్కూలుకు వెళ్ళి వచ్చాడు. వెంటనే బాత్‌రూంలోకివెళ్ళి పళ్లపొడితో పళ్ళు చాలాసేపు తోమి నోరంతా శుభ్రంగా కడిగాడు. మళ్ళీ రాత్రి నిద్రపోయే ముందు శుభ్రంగా కడిగాడు. నాయనమ్మ అడిగింది ''ఏమిట్రా ఇప్పుడు పళ్ళు తోమావు'' అని. వాడేమీ మాట్లాడలేదు.

మర్నాడు ఉదయాన్నే మామూలుగా కాకుండా చాలా ఎక్కువసేపు పళ్ళుతోమి ముఖం కడిగాడు. నానీ స్కూలుకు వేళ్ళేటప్పుడు పళ్ళపొడి పొట్లం కట్టుకొని వెళ్ళాడు. స్కూల్‌లో ఇంట్రవెల్‌లో మళ్ళీ కడిగాడు శుభ్రంగా. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు మళ్ళీ కడిగాడు. తల్లి చూసి ఆశ్చర్య పడింది. ''ఏరా నానీ! పళ్ళు పొడ్డున తోమలేదా'' అంది ''తోమానమ్మా'' నానీ సమాధానం. సాయంత్రం స్కూల్‌లో ఇంట్రవెల్‌లో పళ్ళు తోమాడు నానీ. మాష్టారు అది చూచి ''ఏరా నానీ పూటా పళ్ళు తోముతున్నావా'' అనడంతో వేగంగా క్లాసు కెళ్ళాడు. స్కూలు అయినాక నానీ జేబులో పళ్ళపొడి పొట్లం చూసి నానీ తండ్రితో తనకుగల స్నేహంవల్ల వాడితో పాటు ఇంటికి వచ్చారు. అదే సమయానికి నానీ తండ్రి కూడా ఇంటికి వచ్చాడు.

మాస్టారు స్కూల్లో నానీ మొఖం కడిగిన విషయం చెప్పి నానీ అలా ప్రవర్తించడానికి కారణమేమిటన్నారు. నానీ తండ్రి ఆశ్చర్యపడి భార్యను పిలిచి అడిగాడు. ఆమె కూడా ''అవునండీ మధ్యాహ్నం కూడా కడిగాడు. మళ్ళీ ఇప్పుడు కూడా కడుగుతున్నాడు'' అంది. ఇంతలో నానీ మొఖం తుడుచుకుంటూ వాకిట్లోకి వచ్చాడు. నానీ తండ్రి ''ఒరే నానీ, ఎందుకురా? ఇన్నిసార్లు మొఖం కడుగుతున్నావు'' అన్నాడు. వాడు మాస్టారి వైపు చూసి వూరుకున్నాడు. తండ్రి మళ్ళీ గట్టిగా అడగడంతో తల వంచుకొని ఇలా అన్నాడు: ''మొన్న స్కూల్లో మాష్టరుగారు పాఠం చెప్తూ నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది అన్నారు నాన్నా! అందుకని మన వూరు శుభ్రంగా ఉండాలని నోరు బాగా కడుగుతున్నాను. మర్నాడు ఇంకా ఊరు శుభ్రంగా కాలేదు ఎందుకని మరి! అన్నాడు నానీ. అందరికీ ఆ సమాధానం వినేసరికి బుర్ర తిరిగింది. ఊరి బాగుకోసం నానీపడే ఆరాటం తమకు లేనందున సిగ్గుపడ్డారు. నానీ పసిమనసు తను చెప్పిన సామెతను ఇలా అర్థం చేసుకొనే సరికి మాస్టారు తెల్లబోయారు. తర్వాత దాని అర్థం నానీకి మాస్టారు వివరించి చెప్పారని వేరే చెప్పక్కర్లేదు కానీ చెప్తున్నాను.

—పొత్తూరి నాగేంద్రమ్